క్లుప్తంగా

ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణల తొలగింపు



పొక్లెయిన్‌తో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులోని ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలపై బుధవారం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. సత్యం జంక్షన్ నుంచి నక్కవానిపాలెం, సీతమ్మధార రైతుబజార్ వరకు గల ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమించి చేపట్టిన కట్టడాలు, ఏర్పాటు చేసిన బడ్డీకొట్లను పొక్లెయిన్‌తో తొలగించారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి



కొంచాడ రాజు(ఫైల్)

సీతమ్మధార: భవన నిర్మాణ పనుల్లో ప్రమాదవశాత్తు ఒక కార్మికుడు మృతి చెందిన ఘటన ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధి సీతంపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం ఎల్లయ్యపేటకు చెందిన కొంచాడ రాజు(22) తాపీమేస్త్రిగా నగరానికి వలస వచ్చి ఆరిలోవలో నివసిస్తున్నాడు. సీతంపేట రాజేంద్రనగర్‌లో చేపడుతున్న మూడంతస్తుల భవన నిర్మాణంలో పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం పైఅంతస్తు పనుల నిమిత్తం కోలామ్సు వేసేందుకు వినియోగించిన బాక్స్ బిగిస్తుండగా.. అతడు అదుపుతప్పి కిందకు పడిపోయాడు. తలకు తీవ్రగాయం కావడంతో రక్తస్రావంతో కుప్పకూలిపోయాడు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో కేజీహెచ్‌కు తరలించారు. అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్‌ఐ ధరేంద్ర సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ



ఆస్పత్రిలో లబ్ధిదారుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్



53వ వార్డులో పెన్షన్ అందిస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ



45వ వార్డు వరాహగిరి కాలనీ-2లో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్

- ఆస్పత్రులకు వెళ్లి పెన్షన్ అందజేత
- హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు

సీతంపేట: ఒకటో తేదీ వచ్చిందంటే చాలు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ఠంఛన్‌గా అమలవుతున్నాయని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున 5 గంటల నుంచే వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ చురుగ్గా ప్రారంభమైంది. సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు, వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేశారు. అబిద్‌నగర్ సచివాలయానికి చెందిన మహిళ స్థానిక వివేకానంద ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని తెలుసుకున్న వలంటీర్ లలిత అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. 44వ వార్డులో మొత్తం అన్ని రకాల పెన్షన్లు 1,188 ఉండగా.. 932 మందికి పంపిణీ చేసినట్టు అబిద్ నగర్ వెల్ఫేర్ సెక్రటరి హుస్సేన్ తెలిపారు.

జోన్–5లో 80.2 శాతం పంపిణీ

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధిలో సుమారు 80.2 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఏపీడీ పద్మావతి తెలిపారు. జోన్‌లోని 24 వార్డుల సచివాలయాల వెల్ఫేర్ సెక్రటరీలు, ఏపీడీ నేతృత్వంలో వలంటీర్లు బుధవారం వేకువజాము నుంచి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేశారన్నారు. జోన్ పరిధిలో మొత్తం 26,770 మంది పింఛన్‌దారుల్లో 2,1630 మందికి అందించారు. ఆస్పత్రుల్లో ఉన్న లబ్ధిదారులకు సచివాలయ కార్యదర్శుల సమక్షంలో వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ నెల 3లోపు వంద శాతం పంపిణీ పూర్తి చేయాలని అధికారులకు జెడ్సీ కృష్ణ ఆదేశించారు.

45వ వార్డులో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు నరసింహనగర్–3 సచివాలయం పరిధిలోని ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. వార్డులోని పలు ప్రాంతాల్లో వలంటీర్లతో కలిసి సచివాలయ కన్వీనర్లు పెన్షన్లు అందజేశారు. నరసింహనగర్–3 సచివాలయం పరిధిలో వలంటీర్ దివ్యభారతి, సంతోషి మాత కాలనీలో సెక్రటరీ దేవి, వలంటీర్ మంజుల పింఛన్ల సొమ్ము పంపిణీ చేశారు. 255 సచివాలయం పరిధిలో వలంటీర్‌తోపాటు కన్వీనర్ హరిపట్నాయక్ పాల్గొన్నారు.

50వ వార్డులో..

మర్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ చురుగ్గా సాగింది. వార్డు కన్వీనర్లు సనపల నారాయణ స్వామి, సనపల రమేష్‌కుమార్ లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

53వ వార్డులో..

జీవీఎంసీ 53వ వార్డులోని 300 సచివాలయం పరిధిలో పలువురి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. వార్డు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డితో కలిసి కార్పొరేటర్ బర్కత్ అలీ అవ్వాతాతలకు పింఛన్లను పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న కవితా గోష్టి



కవిత వినిపిస్తున్న అయ్యల సోమయాజులు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో జరుగుతున్న 74వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం దర్బారు హాల్లో కవి సమ్మేళనం నిర్వహించారు. కుర్తాళం, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో టీపీఎస్ ఆచార్యులు పర్యవేక్షణలో జరిగిన కవితా గోష్టి సభికులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ కవులు కన్నేపల్లి గౌరీపతి, అయ్యల సోమయాజులు, కన్నేపల్లి వరలక్ష్మి, గుండాన జోగారావు, చిన సూర్యనారాయణ, ఎం.సుబ్బారావు, భార్గవి, ఎం.విజయగోపాల్, కోరాడ నరసింహరావు, డి.పద్మజ, రామతాత, శేఖరమమత్రి ప్రభాకర్, డి.వి.సూర్యారావు, టీపీఎస్ ఆచార్యులు, వి.సుజాతా మూర్తిభీమేశ్వర రావు, కొచ్చెర్ల సత్యనారాయణ తదితరులు తమ కవితలు వినిపించారు. వీరందరినీ పూలమాలలతో సత్కరించారు. శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని, కుర్తాళం పీఠం ఆస్థాన వేద పండితుడు మాచవోలు రమేష్‌శర్మ, లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా దుర్గాగణపతి ఆలయ ప్రారంభోత్సవం



ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ లీలావతి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ రజక వీధిలో శ్రీదుర్గాగణపతి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి ముఖ్య అతిథులుగా ఆలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ కాలనీ పెద్దల సమక్షంలో శాస్త్రీయంగా నిర్మించిన ఈ ఆలయ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ అర్చకుడు మేడూరి శ్రీనివాసరావు శర్మ వేదమంత్రాల నడుమ ఈ కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం భారీ అన్నదానం జరిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బులుసు జగదీష్, ఎస్.ప్రసాదరావుతోపాటు ఎం వెంకటేశ్వరరావు, ఇ.మంగరాజు, పి.కృష్ణారావు, శివ, అజయ్, ఇతర ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా వీరబాబు పరస మహోత్సవం



వరాహ లక్ష్మీగణపతికి పూజలు చేస్తున్న భాగ్యలక్ష్మి

సీతంపేట: అక్కయ్యపాలెం మూడుగుళ్ల వద్ద వెలసిన వరాహ లక్ష్మీగణపతి ఆలయ 23వ వార్షికోత్సవం, శ్రీవీరబాబు తులసికోట పరస మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు బొడ్డేటి భాగ్యలక్ష్మి కుమారుడు బొడ్డేటి అప్పారావు ఆధ్వర్యంలో వరాహ లక్ష్మీగణపతికి విశేష పూజలు చేశారు. ఉదయం ఆలయం వద్ద గణపతి హోమం నిర్వహించారు. భక్తులు ఆలయాన్ని దర్శించి పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద సుమారు వెయ్యి మందికి అన్నదానం జరిపారు. సాయంత్రం గరిడీ(భాగవతా సేవ), పరసలో దుకాణాల వద్ద ప్రజల సందడి నెలకొంది. కార్యక్రమంలో ఆంజనేయ స్వామి ఆలయ అధ్యక్షుడు రాజగిరి అప్పలరాజు, గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్, గౌరవాధ్యక్షుడు పి.ఎస్.జె.వి.ప్రసాద్, కాళ్ల వెంకటరావు, మళ్ల త్రినాథ్, ఆడారి పారుపల్లి రవి, కర్రి శంకర్ కన్నా, కర్రి అచ్యుతరావు, పిల్లా పకీరునాయుడు, దాడి గోవిందరాజు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కమనీయం.. కాశీవిశ్వేశ్వరుడి కల్యాణం



కల్యాణమూర్తులు

మర్రిపాలెం: మాఘ మాసం భీష్మ ఏకాదశి సందర్భంగా 53వ వార్డు మర్రిపాలెం పార్వతీనగర్‌లో హైవేకు ఆనుకుని ఉన్న కాశీవిశ్వేశ్వరాలయ 32వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీవిశ్వేశ్వర స్వామి, అన్నపూర్ణాదేవిల కల్యాణం వైభవంగా జరిపారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఈవో బి.ప్రసాద్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకుడు అందుకూరి శివాజీశర్మ వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఈ ఉత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో సామాజిక భవనం



వెంకటేశ్వర కాలనీలో శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు వెంకటేశ్వర కాలనీలో రూ.20 లక్షలతో సామాజిక భవన నిర్మాణానికి కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో బుధవారం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జక్కంపూడి సత్యనారాయణ, తిరుపతిరావు, నరసయ్య, అప్పన్న, రవి, గోపి, వీరబాబు, రాణి, రాము, ఠాగూర్, శ్రీను, లక్ష్మణ్, శ్యాం, కన్నా, జీవీఎంసీ డీఈ, ఏఈ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల హర్షం

సీతంపేట: విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేకంగా విశ్వకర్మ యోజన పథకాన్ని రూపొందిస్తున్నట్టు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం హర్షించదగ్గ విషయమని విశ్వబ్రాహ్మణుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివకోటి శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ సమావేశాల్లో పంచ వృత్తుదారులైన విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతి కోసం ఎస్ఎంఎస్ ద్వారా ఆదుకుంటామని నిర్మలా సీతారామన్ తెలిపారని, ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రికి విశాఖ జిల్లా విశ్వబ్రాహ్మణుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

స్టేజ్ తొలగింపుపై నిరసన

మర్రిపాలెం: సేదతీరడానికి, ఫంక్షన్లు జరుపుకోడానికి తాము కష్టపడి కట్టుకున్న స్టేజ్‌ను అన్యాయంగా తొలగించారని 53వ వార్డు శివనగర్‌వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం జోన్–5 టౌన్ ప్లానింగ్ సిబ్బంది దీనిని తొలగించడంతో స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని నిరసన తెలిపారు. వీరికి రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ మద్దతు తెలిపారు.

రైతుబజార్‌లో తనిఖీలు



కంచరపాలెం రైతుబజార్‌లో దుకాణాలను పరిశీలిస్తున్న మార్కెటింగ్ అధికారి యాసిన్

కంచరపాలెం: స్థానిక రైతుబజార్‌లో బుధవారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ అధికారి ఎండీ యాసిన్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డ్వాక్రా గ్రూపులు, పీహెచ్‌సీ, రైతుల స్టాళ్లు, రెంటెడ్ స్టాళ్లను పరిశీలించారు. నాణ్యమైన కూరగాయలను వినియోగదారులకు విక్రయించాలని ఆయన సూచించారు. బజార్ ప్రధాన ద్వారం వద్ద అక్రమ దుకాణాల ఏర్పాటుతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సాయంత్రం వేళ బజార్‌లో లైట్లు సరిపోవడం లేదని రైతులు వాపోయారు. రైతుబజార్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఈవో కృష్ణమోహన్‌కు ఎండీ యాసిన్ ఆదేశించారు. అనంతరం రైతుల ఐడీ కార్డులు, రికార్డు, హాజరు పట్టీలను ఆయన పరిశీలించారు.

ఎస్‌పీఎల్‌లో అర్ధ సెంచరీల మోత



శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ జట్టు



దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు



ఫైనల్స్‌కు చేరుకున్న ఎన్ఎస్ఆర్ఐటీ జట్టు

దొండపర్తి (విశాఖ దక్షిణ): సాక్షి ప్రీమియర్ లీగ్ తుది అంకానికి చేరుకుంది. బుధవారం ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో జరిగిన మ్యాచ్‌ల్లో అర్ధ సెంచరీల మోతతో భారీ స్కోర్లు నమోదయ్యాయి. ఉదయం మూడో స్థానం కోసం మ్యాచ్‌లు జరగగా... మధ్యాహ్నం సెమీఫైనల్స్ జరిగాయి. వీటిలో బ్యాట్స్‌మెన్ అర్ధ సెంచరీలతో ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపించి తమ జట్లను ఫైనల్స్‌కు చేర్చారు. గురువారం ఉదయం జూనియర్స్ విభాగంలో జరిగే ఫైనల్ పోరులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ (కంచరపాలెం), సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజ్ (గిడిజాల) తలపడనున్నాయి. అలాగే సీనియర్ విభాగంలో ఎన్ఎస్ఆర్ఐటీ కాలేజ్ (శొంఠ్యాం), దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అనకాపల్లి) జట్ల మధ్య ఫైనల్స్ పోరు జరగనుంది. విజేతలకు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానోత్సవం జరగనుంది. సాక్షి మీడియా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలకు సీఎంఆర్ షాపింగ్ మాల్ జిల్లా స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.

14 పరుగుల తేడాతో ఎన్ఎస్ఆర్ఐటీ విజయం

బుధవారం ఉదయం జరిగిన తొలి మ్యాచ్‌లో ఎన్ఎస్ఆర్ఐటీ కాలేజ్ జట్టు (శొంఠ్యాం) 14 పరుగులు తేడాతో జీవీపీ కాలేజ్ ఫర్ డిగ్రీ అండ్ పీజీ జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన జీవీపీ కాలేజ్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన ఎన్ఎస్ఆర్ఐటీ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జీవీపీ కాలేజ్ 9.3 ఓవర్లలో 70 పరుగులు చేసి ఆలౌట్ అయింది.

8 పరుగులు తేడాతో శ్రీ కాశ్యప్ విజయకేతనం

రెండో మ్యాచ్‌లో అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ (నర్సీపట్నం), శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ (శ్రీనగర్) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 73 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టపోయి కేవలం 65 పరుగులు మాత్రమే చేసింది. శ్రీ కాశ్యప్ జట్టు 8 పరుగుల తేడాతో విజయం సాధించింది.

9 వికెట్ల తేడాతో డైట్ కాలేజ్ భారీ విజయం

మధ్యాహ్నం జరిగిన తొలి సెమీఫైనల్స్ మ్యాచ్‌లో రఘు ఇంజినీరింగ్ కాలేజ్(దాకమర్రి), దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్లు (అనకాపల్లి) తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన రఘు ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు 9 ఓవర్లలో కేవలం ఒక వికెట్ మాత్రమే నష్టపోయి 80 పరుగుల విజయ లక్ష్యాన్ని ఛేదించి ఫైనల్స్‌కు చేరుకుంది.

భారీ విజయంతో ఫైనల్‌కు ఎన్ఎస్ఆర్ఐటీ

మధ్యాహ్నం జరిగిన నాలుగో మ్యాచ్ సెమీ ఫైనల్స్‌లో ఎన్ఎస్ఆర్ఐటీ కాలేజ్ 46 పరుగుల భారీ ఆధిక్యంతో శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్‌పై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎన్ఎస్ఆర్ఐటీ జట్టు నిర్ణత 10 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 95 పరుగుల స్కోరు నమోదు చేసింది. భారీ విజయలక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి కేవలం 49 పరుగులు మాత్రమే చేయగలిగింది.

షాలిమార్ – తాంబరం స్పెషల్ రద్దు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): షాలిమార్–తాంబరం–షాలిమార్(08041/08042) వీక్లీ స్పెషల్‌ను రద్దు చేస్తున్నట్లు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

రాంచీ – విల్లుపురం – రాంచీ మధ్య స్పెషల్స్

దక్షిణ భారతదేశంలోని వలస కార్మికుల సౌకర్యార్థం రాంచీ – విల్లుపురం – రాంచీ (08068 / 08067) మధ్య వీక్లీ స్పెషల్స్ నడుపుతున్నట్లు త్రిపాఠి తెలిపారు. ప్రతీ శుక్రవారం రాంచీలో మధ్యరాత్రి 11.55 గంటలకు బయల్దేరి దువ్వాడ మీదుగా ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విల్లుపురంలో ప్రతీ మంగళవారం సాయంత్రం 5.15 గంటలకు బయల్దేరి గురువారం ఉదయం 6.45కు రాంచీ చేరుకుంటుంది. ఈ వీక్లీ స్పెషల్ రైలు ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 28 వరకు నడుస్తుంది.

➡ మచిలీపట్నం – విశాఖపట్నం – మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌కు మరో మూడు స్లీపర్ క్లాస్ కోచ్‌లను అదనంగా జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

యూరోపియన్ సదస్సుకు అపోలో వైద్యుడు

ఆరిలోవ(విశాఖ తూర్పు): ఈ ఏడాది మే నెలలో జరగనున్న యూరోపియన్ వార్షిక సదస్సుకు హాజరు కావాలని హెల్త్‌సిటీ అపోలో ఆస్పత్రికి చెందిన ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ అబ్దుల్ డి.ఖాన్‌కు ఆహ్వానం అందింది. యూరోపియన్ ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ ఇన్ ఆర్థోపెడిక్స్ అండ్ ట్రమటాలజీ(ఎఫెర్ట్) ఆధ్వర్యంలో యూరప్ ఖండం వియన్నాలో ఈ సదస్సు జరగనుంది. అపోలోలో తాను విజయవంతంగా నిర్వహించిన రెండు సర్జరీలకు సంబంధించిన కథనాలపై ఈ సదస్సులో మౌఖిక ప్రదర్శన చేస్తానని ఖాన్ బుధవారం తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చాలని వినతి

మహారాణిపేట(విశాఖ దక్షిణ) : రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమురు నాగేశ్వరరావును పౌరసరఫరాల శాఖలో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యల మీద మంత్రికి వినతి పత్రం సమర్పించారు. తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న సుమారు 750 మంది అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్పు చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

ఇంటర్ పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ

ఆర్ఐవో సత్యనారాయణ

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఆర్ఐవో ఆర్.సత్యనారాయణ తెలిపారు. పరీక్షల నిర్వహణకు సన్నద్ధత చేసే క్రమంలో ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు బుధవారం వెబెక్స్ ద్వారా సమీక్షించారు. నగరంలోని ఆర్ఐవో కార్యాలయం నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ప్రాక్టికల్స్, వార్షిక పరీక్షల నిర్వహణకు ఉమ్మడి విశాఖ జిల్లాలో చేస్తున్న ఏర్పాట్లపై ఉన్నతాధికారులకు ఆర్ఐవో వివరించారు. విశాఖలో 185, అనకాపల్లిలో 136, అల్లూరి జిల్లాలో 39 జూనియర్ కాలేజీల నుంచి మొదటి సంవత్సరం 56,437 మంది, రెండో సంవత్సరం 56,625 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రైవేట్‌గా 8,116 మంది పరీక్షలకు ఫీజు చెల్లించినట్లు వివరించారు. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ కోసం తగిన సౌకర్యాలు ఉన్న కాలేజీలను ఇప్పటికే గుర్తించినట్లు చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పరీక్ష కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేసేలా ఇప్పటికే కళాశాల ప్రిన్సిపాళ్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. అనకాపల్లి జిల్లా డీవీఈవో బి.సుజాత, కార్యాలయ పర్యవేక్షకుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనలే జీవితాన్ని నిర్దేశిస్తాయి



మాట్లాడుతున్న సీపీ సీహెచ్ శ్రీకాంత్

కొమ్మాది: మన ఆలోచనలే మన జీవితాన్ని నిర్దేశిస్తాయని, అందుకే యువత ఆలోచనలు ఎప్పుడూ ఉన్నతంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ సూచించారు. రుషికొండలో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన ట్రైనింగ్ మిషన్ సంస్థ భవన్‌లో భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 14వ గిరిజన యూత్ ఎక్స్‌ఛేంజ్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జీవితంలో ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని, నిరంతరం సాధన చేసిన నాడే ఉన్నత స్థానానికి చేరుకోగలరన్నారు. యువత నక్సలిజం వైపు, చెడు మార్గాల వైపు వెళ్లడానికి గల కారణాలను విశ్లేషిస్తూ వాటిని అధిగమించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించారు. నెహ్రూ యువ కేంద్రం సంచాలకులు ఎ.విజయారావు, ట్రైనింగ్ సెంటర్ ఈడీ చినబాబు పాల్గొన్నారు.

సంజీవని నిధికి 'ఇంటర్' విరాళం రూ.50 వేలు



కలెక్టర్ మల్లికార్జునకు చెక్ అందజేస్తున్న ఆర్ఐవో

విశాఖ విద్య: జిల్లా కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సంజీవని నిధికి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల తరపున రూ.50 వేలను విరాళం ఇచ్చారు. దీనిని చెక్కు రూపంలో ఆర్ఐవో ఆర్.సత్యనారాయణ బుధవారం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు అందజేశారు. జిల్లాలోని 10 కాలేజీల నుంచి రూ.50 వేలు సేకరించగా, ఇందులో ఒక్క పెందుర్తి కాలేజీ నుంచే రూ. 20 వేలు ఇచ్చారు. నిరుపేదలకు ఆరోగ్య పరంగా అత్యవసర సమయంలో ఆర్థిక సాయం అందించేందుకు ఏర్పాటు చేసిన సంజీవని నిధికి తోచిన రీతిలో వితరణ ఇచ్చేందుకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ముందుకు వస్తుండటం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లను ఈ విషయంలో చైతన్యం తీసుకొచ్చిన ఆర్ఐవోను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

న్యాయవాదుల సంఘం ఎన్నికల అధికారిగా జీఎం రెడ్డి

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది జి.మహేశ్వర్ రెడ్డి నియమితులయ్యారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వైద్యుల రవీంద్ర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. 2023–24 సంవత్సరానికి సంఘం వార్షిక ఎన్నికలు ఈ నెల 24న నిర్వహించేందుకు రాష్ట్ర బార్ కౌన్సిల్ ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. దీనిలో అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, క్రీడా, గ్రంథాలయ కార్యదర్శులు, సీనియర్ సభ్యులతో పాటు మహిళా ప్రతినిధిని, మరో 10 మంది సాధారణ సభ్యులను ఎన్నుకుంటారు. వివిధ పదవులకు పోటీ చేస్తున్న అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం ముమ్మరం చేశారు.

విశాఖ టు ఢిల్లీ ప్రజాపోరు యాత్ర



ప్రజాపోరు యాత్రను ప్రారంభిస్తున్న మిట్ట రామారావు

సీతంపేట(విశాఖ ఉత్తర): కరెన్సీ నోట్లపై డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని, దీనిపై ఈ పార్లమెంట్ సమావేశాలలో బిల్లు పెట్టాలని కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జెర్రిపోతుల పరశురామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్ నుంచి ఢిల్లీ వరకు ప్రజాపోరు రథయాత్ర చేపట్టారు. విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి మిట్ట రామారావు, దళిత ద్రావిడ పార్టీ జాతీయ అధ్యక్షుడు మళ్ల జీవన్ కుమార్, సీఏపీఎస్ జాతీయ సలహాదారు ఆళ్ల రామకృష్ణ జెండా ఊపి యాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ ఈ డిమాండ్ సాధన కోసం గత ఐదేళ్లలో పాదయాత్ర, ప్రజా చైతన్య రథయాత్ర, జ్ఞానయుద్ధ యాత్ర, ఢిల్లీలో మహాధర్నా నిర్వహించామని, 8 మంది ఎంపీలతో మాట్లాడినట్టు తెలిపారు. మిగతా ఎంపీలతో కూడా మాట్లాడి పార్లమెంట్‌లో బిల్లుపెట్టాలన్న లక్ష్యంతో ఇప్పుడు ప్రజాపోరు యాత్ర తలపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కంఠ వేణు, ఆతవ విజయభాస్కర్, చింతాడ రత్నం, గురుమూర్తి ప్రభాకర్, పిడుగు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒక వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కప్పరాడలో నివసిస్తున్న ఎం.రాము అనే వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి దాటాక ద్విచక్ర వాహనంపై సర్వీస్ రోడ్డులో కప్పరాడ జంక్షన్ నుంచి తాటిచెట్లపాలెం వైపు వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో అతడికి గాయాలయ్యాయి. చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. బుధవారం క్షతగాత్రుడి భార్య ఎం.భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

4న జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశం

మహారాణిపేట(విశాఖ దక్షిణ): జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం 4న శనివారం నిర్వహించనున్నారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన ఒకటి నుంచి ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షన నిర్వహించనున్నట్టు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 4న ఉదయం పది గంటల నుంచి సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.